# సాక్షి అనంతపురం

సోమవారం । 31 । మార్చి । 2025






**ప్రాణం మీదకు తెచ్చిన హెడ్‌ఫోన్**

హెడ్‌ఫోన్ పెట్టుకుని సెల్‌ఫోన్‌లో పాటలు వినాలనుకున్న మోజు చివరికి ఓ యువకుడి ప్రాణాల మీదకు తెచ్చింది. 8లో



**ఆకట్టుకున్న గ్రామీణ పోటీలు**

ఉగాది సందర్భంగా తాడిపత్రి సమీపంలోని పెన్నా నది ఒడ్డున, గార్లదిన్నె మండలం కల్లూరులో నిర్వహించిన గ్రామీణ క్రీడా పోటీలు ఆకట్టుకున్నాయి. 8లో

గరిష్టం/కనిష్టం

39.1°/26°

జిల్లా అంతటా ఎండలు దారెత్తిస్తున్నాయి. ఆదివారం భానుడు భగభగలాడాడు. గాలి వేగం స్వల్పంగా పెరిగింది. వేసవితాపం అధికంగా ఉంది.

## న్యూస్‌రీల్

### జిల్లాను ప్రగతి బాటలో నడిపిద్దాం: కలెక్టర్



సంప్రదాయ దుస్తుల్లో ఎడ్ల బండిపై వస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఇతర అధికారులు

**అనంతపురం కల్చరల్:** జిల్లాను ప్రగతి బాటలో నడిపించేందుకు శ్రమిద్దామని కలెక్టర్ వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం విశ్వావసు నామ ఉగాదిని కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వినోద్‌కుమార్‌తో పాటు జేసీ శివ్‌నారాయణ్ శర్మ, ఇతర జిల్లాధికారులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. కలెక్టర్, జేసీ ఎద్దులబండి నడుపుతూ రెవెన్యూ భవన్ వరకూ రావడం ఆకట్టుకుంది. అందరూ ఉగాది పచ్చడి తిన్న అనంతరం వేద పండితుడు సీతారామమోహన శర్మ పంచాంగ శ్రవణం చేశారు. చిన్నారులు శాస్త్రీయ నృత్యాలు ప్రదర్శించారు. జనప్రియ కవి ఏలూరు యంగన్న నేతృత్వంలో సాగిన కవి సమ్మేళనంలో రాజారాం, చంద్రశేఖర శాస్త్రి, వెంకటేశ్వరప్రసాద్, వన్నప్ప తదితరుల కవితాగానం ఆకట్టుకుంది.

**సమగ్ర అభివృద్ధే ధ్యేయం..**

ఉగాది వేడుకల్లో కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ శివ్ నారాయణ్ శర్మ మాట్లాడుతూ జిల్లాలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'ని వేగంగా చేపట్టాల్సి ఉందన్నారు. ఉద్యాన రంగంలో తలసరి ఆదాయాన్ని పెంచుతామన్నారు. ఇప్పటికే 46 ఎకరాలతో ల్యాండ్ బ్యాంకు ఏర్పాటు చేసి రాష్ట్రంలోనే తొలి స్థానంలో నిలిచామన్నారు. అధికారులతో పాటు అందరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. అనంతరం కవులను, సీనియర్ నాట్యాచార్యులు సంధ్యామూర్తిని, దివ్యశ్రీ, కావ్య, శుభమంగళ తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఫారెస్టు సెటిల్‌మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, పర్యాటక శాఖాధికారి జయకుమార్ బాబు, ఆర్డీఓలు కేశవ నాయుడు, వసంత బాబు, సీపీఓ అశోక్‌కుమార్, సైనిక సంక్షేమ శాఖాధికారి తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.




కవి ఏలూరు యంగన్నను సత్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

# గాల్లో మాతాశిశు ప్రాణాలు



రాయదుర్గం ప్రాంతానికి చెందిన జ్యోతి (30) గతేడాది డిసెంబర్ 2న మూడో కాన్పు కోసం అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రికి వచ్చింది. రక్తహీనతతో బాధపడుతున్న ఆమె .. ప్రసవం సమయంలో కార్డియాక్ అరెస్టుతో బిడ్డకు జన్మనిచ్చిన కొద్దిసేపటికే ప్రాణాలు విడిచింది. పుట్టిన బిడ్డ కూడా కొన్ని నిమిషాలకే ఊపిరి వదిలింది. మరణించిన బిడ్డను ఆస్పత్రి సిబ్బంది అట్టపెట్టెలో ఉంచి కుటుంబ సభ్యులకు అప్పగించడం అప్పట్లో తీవ్ర వివాదాస్పమైంది.

- ఏడాదిలోనే రాయదుర్గం యూపీహెచ్‌సీ పరిధిలో నలుగురు తల్లులు మృతి చెందారు. అదే విధంగా తరిమెల, వజ్రకరూరులో ఏడుగురు చొప్పున పసికందులు మృత్యువాత పడ్డారు.



- పిట్టల్లా రాలుతున్న చిన్నారులు
- ఏడాదిలో 27 మంది తల్లులు మృతి
- మాతా శిశు మరణాల నివారణలో ఆరోగ్యశాఖ విఫలం

| | |
|---|---|
| జిల్లాలో మొత్తం పీహెచ్‌సీలు | 45 |
| యూపీహెచ్‌సీలు | 25 |
| గతేడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు జరిగిన తల్లుల మరణాలు | 27 |
| పసికందుల మరణాలు | 218 |

**అనంతపురం మెడికల్:** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల నిర్లక్ష్యం పసికందులు, గర్భిణులకు శాపంగా మారుతోంది. ఆరోగ్య శాఖ నివేదికల ప్రకారం జిల్లావ్యాప్తంగా గతేడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 27 మంది తల్లులు, 218 మంది పసికందుల ఊపిరి గాల్లో కలసి పోయింది. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కష్టతరమైన కేసుల (హైరిస్క్) పట్ల ప్రత్యేక దృష్టి సారించాల్సిన పీహెచ్‌సీ వైద్యాధికారులు ఆయారాం.. గయారాం అన్న చందంగా విధులు నిర్వర్తిస్తున్నారనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా జిల్లా అధికార యంత్రాంగం స్పందించకపోవడం గమనార్హం.

**అన్నింటా విఫలం..**

మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి రెగ్యులర్‌గా యాంటినేటల్ చెకప్స్ చేయడంతో పాటు హైరిస్క్ గర్భిణులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించడంలో ఆరోగ్య శాఖ విఫలమవుతోంది. బిడ్డ ఆరోగ్యంగా పుట్టేందుకు తల్లులు గర్భం సమయంలో పౌష్టికాహారం తీసుకునేలా చూడాల్సి ఉన్నా అటువంటి పరిస్థితి లేకుండా పోతోంది. ఈ క్రమంలో తక్కువ బరువుతో పసికందులు జన్మిస్తున్నారు. వివిధ రకాల ఇన్‌ఫెక్షన్లకు గురై కొన్ని రోజులకే ప్రాణాలు విడుస్తున్నారు.

**ఆదాయంపైనే ధ్యాస..**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో అవినీతి కంపు కొడుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఓ అధికారిణి చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. స్కానింగ్ సెంటర్లు, ప్రైవేట్ ఆస్పత్రులు, ఆర్‌ఎంపీ క్లినిక్‌లపై దాడులు చేయడం.. తర్వాత కొన్ని రోజులకే పట్టించుకోకపోవడం సాధారణంగా మారిపోయింది.



బ్రహ్మసముద్రం మండలం భైరవ సముద్రం గ్రామానికి చెందిన తిప్పమ్మ (32) గతేడాది గర్భం దాల్చింది. ఈ ఏడాది ఫిబ్రవరి 11న మూడో కాన్పు కోసం అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రికి వచ్చింది. చివరి నిమిషంలో మృత్యువుతో పోరాడి ప్రాణాలు విడిచింది.

**చర్యలు తీసుకుంటున్నాం**



మాతా, శిశు మరణాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం. మరణాలు చోటుచేసుకున్న పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బందిని గట్టిగా మందలిస్తున్నాం. హైరిస్క్ గర్భిణులకు సుఖ ప్రసవం జరిగేలా చూస్తున్నాం. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవం పొందేలా అవగాహన కల్పిస్తున్నాం.

– డాక్టర్ ఈ. భ్రమరాంబ దేవి, డీఎంహెచ్‌ఓ

### నేడు ఫిర్యాదుల స్వీకరణ ఉండదు



**అనంతపురం అర్బన్:** కలెక్టరేట్‌లో సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం ఉండదు. రంజాన్ సందర్భంగా ప్రభుత్వం సెలవు ప్రకటించినందున రద్దు చేసినట్లు కలెక్టర్ వి.వినోద్ కుమార్ ఆదివారం తెలియజేశారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

### దాతృత్వానికి ప్రతీక రంజాన్

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు 'అనంత'



**అనంతపురం కార్పొరేషన్:** దాతృత్వానికి ప్రతీక రంజాన్ అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ముస్లిం మైనార్టీ సోదరులు రంజాన్‌ను సంతోషంగా జరుపుకోవాలని పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. అల్లా ఆశీస్సులు ప్రతి ఒక్కరిపైనా ఉండాలని 'అనంత' ఆకాంక్షించారు.

**కలెక్టర్ రంజాన్ శుభాకాంక్షలు**

**అనంతపురం అర్బన్:** ముస్లిం సోదరులకు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగను ఆనందంగా జరుపుకోవాలన్నారు. అల్లా కృపాకటాక్షాలతో జిల్లా సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఆనందమయ జీవితం గడపాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

## కసాపురంలో ఉగాది ఉత్సవాలు ప్రారంభం



వజ్ర కవచ అలంకరణలో నెట్టికంటుడు



భక్త జనం మధ్య గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

**గుంతకల్లు రూరల్:** కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఆదివారం ఉగాది ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులు జరిగే ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే నెట్టికంటి ఆంజనేయ స్వామి వారికి అర్చకులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. వజ్ర కవచాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉత్సవాల్లో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం ఆలయ ముఖ మండపం వద్ద పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కసాపురం గ్రామస్తులు మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయస్వామి వార్లను గరుడ వాహనంపై కొలువు దీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పల్లకీలో ఆశీనులను చేసి గ్రామోత్సవం చేపట్టారు.

## • నేడు ఈద్-ఉల్-ఫితర్



అనంతపురంలో ఆదివారం రాత్రి చివరి ఉపవాస దీక్ష విరమించి నమాజు చేస్తున్న ముస్లింలు

జిల్లావ్యాప్తంగా సోమవారం ఈద్-ఉల్-ఫితర్ ఘనంగా జరగనుంది. ఈద్గాలు, మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. ముతవల్లీలు ప్రత్యేక సందేశం ఇవ్వనున్నారు. వేడుకలను పురస్కరించుకుని ఈద్గాలు, మసీదుల్లో అన్ని ఏర్పాట్లు చేశారు. కాగా, 30 రోజులుగా స్నేహానికి, ఆప్యాయతలకు ప్రాధాన్యమిస్తూ సర్వమత సహనంతో ఆచరించిన ఉపవాస దీక్షలను ఆదివారం రాత్రి నెలవంక దర్శనంతో ముస్లిం సోదరులు విరమించారు. భక్తిశ్రద్ధలతో నమాజు చేశారు.

– అనంతపురం కల్చరల్



# మా వైపు నిలబడినందుకే హత్య చేశారు

- లింగమయ్యను చంపింది పరిటాల సునీత రక్త సంబంధీకులే
- సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ స్పందించాలి
- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



లింగమయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

**అనంతపురం ఎడ్యుకేషన్:** రామగిరి మండలం పాపిరెడ్డిపల్లికి చెందిన కురుబ మజ్జిగ లింగమయ్యను మా వైపు నిలబడినందుకే జీర్ణించుకోలేక హత్య చేశారని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఉదయం లింగమయ్యపై దాడి చేయగా... అనంతపురంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. లింగమయ్య మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పరిశీలించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ హత్యకు పాల్పడింది స్వయంగా పరిటాల సునీత తమ్ముడు రమేష్, మరొక తమ్ముడు సురేష్, వారి కుమారులు ఆదర్శ్, ఆదిత్య, మనోజ్‌నాయుడుతో పాటు మరో ఇద్దరు పిల్లలు అన్నారు. ఎంపీటీసీలతో క్యాంపునకు వెళ్లిన పాపిరెడ్డిపల్లి వైఎస్సార్‌సీపీ నాయకుడు జయచంద్రారెడ్డి ఇంటిపై పలుమార్లు దాడులు చేశారన్నారు. పోలీసులు వెళ్లి నామమాత్రపు చర్యలు తీసుకున్నారన్నారు. కేసులు నమోదు చేసి గట్టి చర్యలు తీసుకుని ఉంటే గ్రామంలో ఈరోజు లింగమయ్య హత్య జరిగేది కాదన్నారు. రెండు రోజుల పాటు గ్రామంలో వరుసగా దాడులు చేశారని, మూడో రోజు కురుబ లింగమయ్యను హత్య చేశారని వాపోయారు.

**పోలీసులూ పరిటాల సునీత పక్షానే..**

రామగిరి ఎంపీపీ ఎన్నికకు నోటిఫికేషన్ వచ్చిన రోజు నుంచి రామగిరి మండలంలో ఎమర్జెన్సీ వాతావరణాన్ని పోలీసు అధికారులు సృష్టించారని తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ వాళ్లు ఎవరూ ఎంపీపీ ఎన్నికల ప్రక్రియలో పాల్గొనకూడదని, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి రామగిరి మండలంలోకి రాకూడదంటూ ఆంక్షలు విధించారన్నారు. ఈ పరిస్థితుల్లో తాము ఓటు హక్కును వినియోగించుకోలేమని ఎంపీటీసీ సభ్యులు హైకోర్టును ఆశ్రయించి రక్షణ పొందారన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీని నమ్మి ఎంపీటీసీ సభ్యులందరినీ బాగేపల్లి చెక్‌పోస్ట్ వద్ద పోలీసులకు అప్పజెప్పామన్నారు. ఆ తర్వాత జరిగిన పరిణామాలన్నీ ప్రజలకు తెలుసన్నారు. ప్రజాస్వామ్యం అపహాస్యం పాలైన విధానం, పోలీసులు పరిటాల సునీత పక్షాన ఏ విధంగా నిలబడ్డారో అందరికీ తెలుసన్నారు. తమ రాజ్యాంగమే నడవాలనే పరిటాల సునీత విధానాన్ని ప్రజాస్వామ్యంలో ఎవరూ ఒప్పుకోరన్నారు. రాజ్యాంగ పదవిలో ఉండి కట్టడి చేయాల్సిన ఆమె ఇలాంటి వాటిని ప్రోత్సహిస్తే ఎలా అని దుయ్యబట్టారు.

**చంద్రబాబూ చర్యలు తీసుకోండి..**

పరిటాల సునీత, ఆమె కుటుంబ సభ్యుల రక్త చరిత్రతో టీడీపీకి కూడా మకిల పడుతోందని, వారిపై సీఎం చంద్రబాబు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రకాష్ రెడ్డి కోరారు. 'ఏ కలుగులో దూరుకున్నా లాక్కొస్తామని సునీత అంటున్నారు.. ఎలుకలు పట్టేందుకు కాదు, మేలు చేయాలని ప్రజలు ఓట్లేశారన్న విషయం గుర్తుంచుకోవాల'న్నారు. హైకోర్టు రక్షణలో ఉన్న ఎంపీటీసీ సభ్యులను టీడీపీ గూండాలు ఎత్తుకెళ్తుండగా అడ్డుకుంటే, దాన్ని వక్రీకరించి పోలీసులను దుర్భాషలాడారంటూ తమపై అక్రమ కేసులు పెట్టారన్నారు. ఎస్పీ పెట్టిన వాహనాల్లో ఎంపీటీసీ సభ్యులను పంపితే అదే వాహనాల్లో ఉన్న పోలీసు అధికారులు పరిటాల సునీతతో ఫోన్‌లో మాట్లాడించి బెదిరించడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. 'ఖాకీ చొక్కా, టోపీపై ఉన్న మూడు సింహాల మీద ప్రమాణం చేసి చెప్పండి... ఇది న్యాయమా' అని పేర్కొన్నారు. మావైపు నిలబడినందుకు లింగమయ్యను హత్య చేశారని, ఇంకా ఎన్ని హత్యలు చేస్తారని ప్రశ్నించారు. 'నీ భర్త వల్ల జిల్లాకు ఫ్యాక్షన్ జిల్లాగా చెడ్డపేరు వచ్చింది. ఇంకా ఎంతమంది సమిధలు కావాలి. చంద్రబాబు గారూ ఇదేనా టీడీపీ ఎజెండా.పవన్‌కల్యాణ్ గారూ ఇందుకేనా మీకు ఓట్లేసింది. దయచేసి ఇప్పటికైనా ఆపండి. అభివృద్ధి చేయండి. ఆపకుండా ఇలానే కొనసాగిస్తే చరిత్ర రిపీట్ అవుతుంది' అని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి స్పష్టం చేశారు.

## రక్తచరిత్రను ప్రజలు హర్షించరు

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్



మాట్లాడుతున్న గోరంట్ల మాధవ్

**అనంతపురం ఎడ్యుకేషన్:** 'గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మా ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పేరూరు డ్యాంను నీటితో నింపితే... నేడు రక్తంతో నింపాలని టీడీపీ ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆమె తనయుడు శ్రీరామ్ చూస్తున్నారు' అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్ మండిపడ్డారు. రక్త చరిత్రను జిల్లా ప్రజలు ఎన్నటికీ హర్షించరనే విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలని హితవు పలికారు. పరిటాల సునీత బంధువుల దాడిలో తీవ్రంగా గాయపడి నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రామగిరి మండలం పాపిరెడ్డిపల్లికి చెందిన లింగమయ్య ప్రాణాలు విడిచాడు. ఈ క్రమంలో ఆదివారం లింగమయ్య మృతదేహాన్ని మాధవ్ పరిశీలించి, కుటుంబసభ్యులతో మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. రాప్తాడు నియోజకవర్గంలో ప్రజాస్వామ్యాన్ని పరిటాల కుటుంబం ఖూనీ చేస్తోందన్నారు. లింగమయ్య, ఆయన కుమారుడిపై పరిటాల వర్గీయులు అత్యంత దుర్మార్గంగా దాడికి పాల్పడడమే ఇందుకు నిదర్శనమన్నారు. రాడ్లు, కొడవళ్లతో వెంటాడి లింగమయ్య తలపై దాడి చేశారన్నారు. ఓ వైపు దాడులకు తెగబడుతూనే మరో వైపు బాధితులపైనే దుర్మార్గంగా కేసులు బనాయిస్తున్నారన్నారు. పోలీసు వ్యవస్థ కూడా నేరస్తులకు అండగా నిలవడం సిగ్గుచేటన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో మరో రక్తచరిత్రను సృష్టించాలని పరిటాల శ్రీరామ్ చూస్తున్నాడని, ఇలాంటి పరిస్థితులు ఇలాగే కొనసాగితే ప్రజా తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఇలాంటి దాడులు, దౌర్జన్యాలను ప్రతిఘటిస్తామన్నారు.

## క్లుప్తంగా

### తాడిపత్రిలో చైన్‌స్నాచింగ్

తాడిపత్రి టౌన్: దైవ దర్శనం చేసుకుని బయటకు వచ్చేలోపు మహిళ మెడలోని బంగారు గొలుసును దుండగులు అపహరించారు. వివరాలు... తాడిపత్రిలోని జయనగర్ కాలనీకి చెందిన లక్ష్మీగోవిందమ్మ ఆదివారం సుంకులమ్మపాలెం వద్ద వున్న సుంకులమ్మ ఆలయానికి వెళ్లింది. ఉగాది పర్వదినం కావడంతో అప్పటికే ఆలయానికి భక్తులు పోటెత్తారు. రద్దీలోనే దైవ దర్శనం చేసుకుని బయటకు వచ్చిన అనంతరం తమన మెడలోని 4 తులాల బరువున్న బంగారం గొలుసు కనిపించలేదు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.


### రాష్ట్ర హాకీ జట్టులో ధర్మవరం వాసులు



రాష్ట్ర జట్టుకు ఎంపికైన ప్రశాంత్, లోకేష్

ధర్మవరం: హాకీ ఇండియా ఆధ్వర్యంలో ఏప్రిల్ 4 నుంచి 15వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లోని ఝూన్సీలో జరిగే 15వ పురుషుల జాతీయ సీనియర్ హాకీ పోటీల్లో ప్రాతినిథ్యం వహించే ఏపీ జట్టులో ధర్మవరానికి చెందిన ప్రశాంత్, లోకేష్‌కు చోటు దక్కింది. ప్రతిభ చాటి రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకున్న స్థానిక క్రీడాకారులను హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్ బంధనాథం సూర్యప్రకాష్, జిల్లా గౌరవాధ్యక్షుడు బండి వేణుగోపాల్, పల్లెం వేణుగోపాల్, బీవీ శ్రీనివాసులు, ఉడుముల రామచంద్ర, గౌరీప్రసాద్, ఊకా రాఘవేంద్ర, మహమ్మద్ అస్లాం, అంజన్న తదితరులు అభినందించారు.


### బావిలో పడిన జింక పిల్ల



జింక పిల్లను కాపాడుతున్న దృశ్యం

అగళి: నీటి కోసం వెదుకులాడుతూ వచ్చిన ఓ జింక పిల్ల చివరకు నీరు లేని బావిలో పడింది. అగళి మండలం కసాపురం గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆదివారం ఉదయం అటుగా వెళ్లిన లైన్‌మెన్ నరసింహమూర్తి గమనించి సమాచారం ఇవ్వడంతో అటవీ శాఖ సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. దాదాపు 20 అడుగుల లోతున ఉన్న బావిలోకి స్థానిక యువకులు నాగరాజు, కుమార్ దిగి జింక పిల్లను సురక్షితంగా బయటకు తీసుకొచ్చి అటవీశాఖ అధికారులు సంజీవరాయుడు, భీమన్న, నాగరాజుకు అప్పగించారు. నీళ్లు తాపిన అనంతరం కోలుకున్న జింకపిల్లను సురక్షితంగా వదిలేశారు.

# చదువుల వేటలో చతికిల



- అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి కాలనీ పంచాయతీ పరిధిలోని జీఎం కాలనీకి చెందిన హర్షవర్ధిని నగర శివారులోని ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఇటీవల పబ్లిక్ పరీక్షలు రాసింది. పరీక్షలు సరిగా రాయలేకపోయానని, ఫెయిల్ అవుతాననే భయంతో ఇటీవల ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది.
- శ్రీసత్యసాయి జిల్లా లేపాక్షి మండలం పి.సడ్లపల్లికి చెందిన బాబు ప్రస్తుతం పదో తరగతి చదువుతున్నాడు. పబ్లిక్ పరీక్షలు సరిగా రాయలేకపోతున్నానని తరచూ బాధపడుతుండేవాడు. పరీక్షలు ఇంకా మిగిలి ఉండగానే తీవ్ర మనస్తాపానికి గురైన బాబు నాలుగు రోజుల కిందట ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్నాడు. చావుబతుకుల మధ్య ఆస్పత్రిలో కొట్టుమిట్టాడుతున్నాడు.

**కొరవడిన విద్యా ప్రమాణాలు**

- ఒత్తిళ్ల పరీక్షలు.. మార్కులే ప్రామాణికం
- అర్ధంతరంగా తనువు చాలిస్తున్న విద్యార్థులు
- జిల్లాలో ఇటీవల ఏడుగురు విద్యార్థుల బలవన్మరణం



అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇటీవల చోటు చేసుకున్న విద్యార్థుల వరుస ఆత్మహత్యలు కలవరపెడుతున్నాయి. చదువు, పరీక్షలంటే ఆందోళన, ఒత్తిడి, కుంగుబాటు వంటి మానసిక సమస్యలు విద్యార్థులను ఆత్మహత్య దిశగా పురిగొల్పుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. చదువుల వేటలో చాలామంది విద్యార్థులు చతికిల పడుతున్నారు. పబ్లిక్ పరీక్షలు కాస్తా ఒత్తిళ్ల పరీక్షలుగా మారుతున్నాయి. ఫీజుల మాయలో పడ్డ కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో విద్యాప్రమాణాల గురించి ఏమాత్రమూ పట్టించుకోవడం లేదు. పిల్లలు ఎలాంటి పరిస్థితులనైనా తట్టుకుని సమాజంలో ధైర్యంగా బతకగలమనే మానసిక ధైర్యాన్ని నింపే చదువులు కాకుండా కేవలం మార్కులే ప్రామాణికంగా విద్యాబోధన సాగిస్తుండడమే ఇందుకు కారణమని మేధావులు అంటున్నారు. ఫలితంగానే చిన్నచిన్న సమస్యలను సైతం అధిగమించే ఆలోచన చేయలేని పిల్లలు శాశ్వతంగా లోకాన్ని వీడుతున్నారని చెబుతున్నారు. గత ఫిబ్రవరి 17న అనంతపురం శివారులోని ఎస్‌ఆర్ జూనియర్ కళాశాల ప్రథమ సంవత్సరం విద్యార్థి శ్రీకాంత్ కళాశాల సమీపంలోని ఓ చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. అంతకు ముందు గుత్తి రోడ్డు సమీపంలోని నారాయణ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థి చరణ్ మూడు అంతస్తుల పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇటీవల నగర శివారులోని బళ్లారి రోడ్డులోని ఓ ప్రైవేట్ కళాశాలలో సీనియర్ ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఇలా పరీక్షలు మొదలైన ఈ కొన్ని రోజుల్లోనే ఉమ్మడి జిల్లాలో దాదాపు ఏడుగురు విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడ్డారు.

**కానరాని మానసిక వికాస శిక్షణ**

'విద్యార్థుల శ్రేయస్సు కోసం ప్రతి విద్యాసంస్థ చర్యలు తీసుకోవాలి. మానసిక కుంగుబాటుకు, ఒత్తిడికి లోనుకాకుండా మానసిక వికాస శిక్షణలు నిర్వహించాలి. నిపుణులతో పాటు సామాజిక సంస్థలతో తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వంటి చర్యలు చేపట్టాలి' అని కూడా సుప్రీంకోర్టు సూచించింది. కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఇలాంటివేవీ కనిపించవు. ర్యాంకుల సాధనే పరమావధిగా భావించే యాజమాన్యాలకు విద్యార్థుల మానసిక ఆరోగ్యం గురించి పట్టడం లేదని పలువురు వాపోతున్నారు. చాలామంది విద్యార్థుల తల్లిదండ్రుల ధోరణి కూడా ఇలానే ఉంది. మార్కుల మాయలో పడి పిల్లలను ఎప్పుడూ 'చదువు...చదువు' అంటూ ఒత్తిళ్లు చేస్తున్నారు.

**ఆత్మహత్యే పరిష్కారం కాదు**



'ఫెయిల్ అవుతామనో.. తల్లిదండ్రులు, బంధువులు, మిత్రుల ముందు తల ఎత్తుకోలేమన్న ఒత్తిడితోనో ఇబ్బంది పడాల్సిన పనిలేదు. మంచి మార్కులు వస్తే ఎలా సంతోషంగా ఉంటామో.. ఓటమి తలుపు తట్టినా చాలెంజింగ్‌గా తీసుకుని, గుండె ధైర్యంతో భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలి. ఫెయిల్యూర్‌కు ఆత్మహత్య పరిష్కారం కాదు. – డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్, మానసిక వైద్య నిపుణుడు

### ప్రాణం మీదకు తెచ్చిన హెడ్‌ఫోన్



గాయపడిన సూర్య

గుత్తి: హెడ్‌ఫోన్ పెట్టుకుని పాటలు వినాలనే మోజు.. చివరకు ప్రాణం మీదకు తెచ్చింది. వివరాలు... గుత్తి మండలం బాచుపల్లి గ్రామానికి చెందిన యువకుడు సూర్య శనివారం రాత్రి హెడ్‌ఫోన్ పెట్టుకుని పాటలు వింటూ స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని లచ్చానుపల్లి రైల్వే బ్రిడ్జి వద్ద పట్టాలు దాటే ప్రయత్నం చేశాడు. అయితే హెడ్‌ఫోన్ పెట్టుకోవడంతో అప్పటికే పట్టాలపై వేగంగా దూసుకువస్తున్న రైలును గమనించలేకపోయాడు. చివరిక్షణంలో అప్రమత్తమయ్యేలోపు రైలు ఢీకొనడంతో ఎగిరి పట్టాల అవతల పడ్డాడు. లోకో పైలెట్ నుంచి సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని స్థానికుల సాయంతో గాలింపు చేపట్టారు. పట్టాల పక్కన తీవ్ర గాయాలతో పడి ఉన్న సూర్యను గమనించి వెంటనే గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

### డ్రైయినేజీలో పడి వ్యక్తి మృతి

పెనుకొండ: అతిగా మద్యం సేవించిన ఓ వ్యక్తి డ్రైయినేజీలో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... పెనుకొండలో నివాసముంటున్న రాము (49) చిన్నాచితక పనులు చేస్తూ వచ్చిన డబ్బుతో మద్యం తాగేవాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి అతిగా మద్యం సేవించిన ఆయన దర్గాసర్కిల్ సమీపంలోని డ్రైయినేజీలో పడ్డాడు. పైకి రాలేక డ్రైయినేజీలోనే కూరుకుపోయి ఊపిరి ఆడక మృతి చెందాడు. ఆదివారం ఉదయం సమీప ప్రాంత ప్రజలు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని వెలికి తీయించి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

### విద్యుదాఘాతంతో యువకుడి మృతి

కళ్యాణదుర్గం రూరల్: విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం మండలం ఓబుళాపురం గ్రామానికి చెందిన నవీన్ (31), జయశ్రీ దంపతులకు ఏడాది వయసున్న కుమారుడు ఉన్నాడు. ఓబుళాపురంలోనే నివాసముంటూ కళ్యాణదుర్గంలో దయాగ్నస్టిక్ సెంటర్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం కళ్యాణదుర్గంలోని తన వ్యాపార కేంద్రానికి వెళ్లేందుకు సిద్ధమైన నవీన్.. బాత్రూమ్‌లో స్నానం చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై కుప్పకూలాడు. బాత్రూమ్ నుంచి గట్టిగా శబ్దం రావడంతో అప్రమత్తమైన కుటుంబసభ్యులు వెంటనే తలుపు బలవంతంగా తీసి పరిశీలించారు. విద్యుత్ ప్రసరిస్తుండడంతో సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆఫ్ చేయించి క్షతగాత్రుడిని వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే నవీన్ మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

### 'శ్రీనివాసా'.. ఇదెక్కడి 'కర్ర'పెత్తనం!

- పరీక్ష కేంద్రంలో విద్యార్థులను కర్రతో కొడుతున్న వైనం
- కేంద్రం చీఫ్‌పై తల్లిదండ్రుల ఆగ్రహం



వాచిన చేతిని చూపుతున్న విద్యార్థిని

ఆత్మకూరు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో పదో తరగతి విద్యార్థులను ఆ కేంద్రం చీఫ్ కర్రతో చితకబాదుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. పరీక్షలు ప్రారంభమైనప్పటి నుంచి శనివారం వరకూ దాదాపు ఐదారుగురు విద్యార్థులను ఆయన చితకబాదినట్లుగా బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాలు... ఆత్మకూరు జెడ్పీ హెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసప్రసాద్‌కు పరీక్ష కేంద్రం చీఫ్‌గా బాధ్యతలు అప్పగించారు. సాధారణంగా పరీక్షలనగానే విద్యార్థులు తీవ్ర ఆందోళనలో ఉంటారు. మార్కుల ఒత్తిళ్ల నేపథ్యంలో పోటీని తాళలేక పలువురు విద్యార్థులు ఇప్పటికే బలవంతంగా తనువు చాలించిన ఘటనలూ ఉన్నాయి. ఇలాంటి తరుణంలో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందిస్తూ పరీక్షలపై ఉన్న భయాన్ని పోగొట్టాల్సిన ప్రధానోపాధ్యాయుడు గాడి తప్పి ప్రవర్తిస్తున్నాడనే ఆరోపణలు వెల్లువెత్తాయి. శనివారం పరీక్ష రాస్తున్న స్థానిక కేజీబీవీ విద్యార్థినిని అకారణంగా కర్రతో కొట్టడంతో ఆమె చెయ్యి పూర్తిగా వాచిపోయింది. ఆదివారం చికిత్స కోసం స్థానిక పీహెచ్‌సీకి చేరుకున్న బాధితురాలు తాను పరీక్ష రాసేందుకు వెళ్లనంటూ ఏడుస్తూ కనిపించింది. తల్లిదండ్రులు, కేజీబీవీ ఉపాధ్యాయులు నచ్చచెప్పడంతో అప్పటికి సర్దుకుపోయింది. వారం రోజుల క్రితం కూడా కురుగుంటకు చెందిన విద్యార్థినిని హెచ్‌ఎమ్ కొట్టినట్లుగా సమాచారం. పరీక్ష రాసే విద్యార్థులు తప్పు చేస్తే దండించాలి కానీ, చేతులు వాచేలా కర్రతో కొట్టడాన్ని తల్లిదండ్రులు తప్పుబడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# తాడిపత్రికి చేరుకున్న ఫయాజ్

- పట్టణంలో పోలీస్ భారీ బందోబస్తు




పోలీస్ బందోబస్తుతో తాడిపత్రిలోని తన ఇంటికి చేరుకుంటున్న ఫయాజ్‌బాషా

తాడిపత్రి టౌన్: భారీ పోలీసు బందోబస్తు మధ్య తాడిపత్రి వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకుడు, మున్సిపల్ కౌన్సిలర్ ఫయాజ్‌బాషా తన ఇంటికి ఆదివారం చేరుకున్నారు. ఈ నెల 29న వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఆదేశాల మేరకు మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంతవెంకట్రామిరెడ్డి.. అనంతపురంలో ఎస్పీ జగదీష్‌ను కలసి సమస్యను వివరించిన విషయం తెలిసిందే. దీంతో తాడిపత్రికి వెళ్లేందుకు ఫయాజ్‌బాషాకు ఎస్పీ అనుమతించారు. ఈ నెల 23న తన నూతన గృహంలో ఇఫ్తార్ విందును ఫయాజ్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇది గిట్టని జేసీ అనుచరులు పెద్ద సంఖ్యలో ఫయాజ్ ఇంటిని చుట్టుముట్టి రాళ్ల దాడికి తెగబడ్డారు. దాడి చేసింది టీడీపీ వారైతే... పోలీసులు వైఎస్సార్‌సీపీ నాయకులు 17 మందిపై కేసులు బనాయించారు. అనంతరం ఈ నెల 26న అర్ధరాత్రి ఫయాజ్‌బాషాను గుట్టుచప్పుడు కాకుండా అనంతపురానికి తరలించారు. రంజాన్ వేళ కుటుంబసభ్యులతో కలసి పండగ జరుపుకోవాలనే ఆయన విజ్ఞప్తిని పోలీసులు తిరస్కరిస్తూ వచ్చారు. ఆంక్షలు విధిస్తూ 4 రోజుల పాటు కుటుంబసభ్యులకు దూరం చేశారు. దీంతో ఈ నెల 29న అంజాద్‌బాషా, అనంత వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్, కర్నూల్ మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, హజ్ కమిటీ మాజీ చైర్మన్ గౌసుల్ అజామ్ తదితరులు ఎస్పీ జగదీష్‌ను కలసి తాడిపత్రిలో జేసీ దౌర్జన్యాలపై ఫిర్యాదు చేసారు. ఫయాజ్‌బాషాను తాడిపత్రికి వెళ్లకుండా ఆంక్షలు విధించడంపై అభ్యంతరాలు వ్యక్తం చేసారు. దీంతో స్పందించిన ఎస్పీ ఆదేశాల మేరకు భారీ బందోబస్తు మధ్య ఆదివారం సాయంత్రం తాడిపత్రిలోని తన ఇంటికి ఫయాజ్ బాషా చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎలాంటి గొడవలు చోటుచేసుకోకుండా ఏఎస్పీ రోహిత్‌కుమార్, సీఐ సాయిప్రసాద్ ఆధ్వర్యంలో దాదాపు 150 మంది పోలీసులు తాడిపత్రిలోని పలు కూడళ్లు, ఫయాజ్ ఇంటి వద్ద బందోబస్తు చేపట్టారు.

# 'ఐస్'తో అనారోగ్యం

- వేసవిలో చల్లదనం కోసం ఇష్టారాజ్యంగా కల్తీ ఐస్ వాడకం
- నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ఐస్ క్యూబ్‌ల తయారీ



ఐస్ క్యూబ్స్

అనంతపురం అగ్రికల్చర్: వేసవిలో చల్లదనం కోసం 'ఐస్' వాడుతున్నారా..? ఐస్ వల్ల నష్టమా.. లాభమా.? అనేది తెలుసుకోవాలని జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు తెలిపారు. ఐస్ ఎలా తయారు చేస్తారు, ఎలా సరఫరా చేస్తున్నారు, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారా. శుద్ధి చేసిన నీటినే వాడుతున్నారా... అన్న విషయాలను ప్రజలు గుర్తించాలన్నారు. లేదంటే అనారోగ్య సమస్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

**ఐస్ వినియోగం ఇలా..**

వేసవితాపం నుంచి కాసింత ఉపశమనం పొందడానికి చాలామంది పండ్లరసాలు, జ్యూస్ సెంటర్లు, చెరకురసం, పుచ్చకాయల రసం వైపు చూస్తుంటారు. చల్లదనం కోసం అందులో ఐస్ ముక్కలు కలపాలని చెబుతుంటారు. ఇలాంటి సమయంలో పండ్లు, చెరకు నాణ్యత గురించి ఆలోచిస్తాం కానీ ఐస్ ముక్కల గురించి అసలు పట్టించుకోరు. మరికొందరు శుభకార్యాల్లో చల్లదనం కోసం డ్రమ్ములోకి ఐస్ క్యూబ్స్ వేస్తుంటారు. అలాగే హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార పదార్థాలు నిల్వ ఉంచడానికి, చేపలు, రొయ్యలు రవాణాకు ఐస్ ఉపయోగిస్తుంటారు.

**నాణ్యత గాలికి..**

ఐస్ తయారు చేయడానికి ఉపయోగించే నీరు 90 శాతం సురక్షితం కాదని చాలాసార్లు వెలుగు చూశాయి. పాచి పట్టిన పైపుల్లో వచ్చే నీరు, తుప్పు పట్టిన ట్రేలు, ఏళ్ల తరబడి శుభ్రం చేయని యంత్రాల ద్వారా తయారు చేస్తున్న ఐస్ ఆరోగ్య పరంగా మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. అప్పటికపుడు కాస్తంత చల్లదనం ఉండొచ్చు కానీ దీర్ఘకాలికంగా అది ఆరోగ్యంపై చెడు ప్రభావం చూపుతుందని గుర్తించాలి. ఐస్‌ను తయారు చేయాలంటే ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ) అనుమతి తప్పనిసరిగా ఉండాలి. నిబంధనల ప్రకారం పరిశుద్ధమైన నీటిని వాడాలి. రవాణాలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలి. కానీ కొంతమంది ఇష్టారాజ్యంగా తయారు చేయడంతో పాటు తోచినట్లు రవాణా చేస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు.

**అధికారుల ఉదాసీనత..**

ప్రజారోగ్యం, ఆహారభద్రతపై దృష్టి సారించాల్సిన అధికార యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరిస్తుండటంతో 'ఐస్' వ్యాపారం జోరుగా సాగుతోంది. మన జిల్లాలో వేసవిలో ప్రతిరోజూ టన్నుల కొద్దీ ఐస్ వాడుతున్నా... ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ అనుమతితో పాటు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్న సంస్థ కానీ ఫ్యాక్టరీ కానీ భూతద్దం పెట్టినా దొరకడం కష్టం. అపరిశుభ్రత మధ్య తయారైన ఐస్‌ను వాడటం వల్ల గొంతు సంబంధిత, శ్వాసకోశ వ్యాధులు, వైరల్ ఇన్ఫెక్షన్, ప్రోటోజోవా ఇన్ఫెక్షన్ లాంటి వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ క్రమంలో అనారోగ్యకరమైన ప్రదేశాలలో జ్యూస్‌లు, పండ్లరసాలు, చెరకు రసం లాంటివి తీసుకోకపోవడం మేలు. తప్పనిసరిగా తీసుకోవాలనుకుంటే 'ఐస్' లేకుండా తీసుకోవాలి. అలాగే శీతల పానీయాల కేంద్రాల్లో చల్లటి నీరు, జ్యూస్‌లు తాగాల్సివస్తే సీసాల మూతలను జాగ్రత్తగా పరిశీలించి నాణ్యమైన వాటిని తీసుకోవాలి. కార్పొరేషన్, మున్సిపాల్టీ, ఆహారభద్రత, ప్రజారోగ్య అధికారులు 'ఐస్' తయారీ, అమ్మకాలపై దృష్టి సారించాలి.



### ఉత్సాహంగా వృషభాల బలప్రదర్శన



రాతి దూలం లాగుతున్న వృషభాలు

చెన్నేకొత్తపల్లి: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని చెన్నేకొత్తపల్లిలో ఆదివారం నిర్వహించిన వృషభాల బల ప్రదర్శన ఉత్సాహంగా సాగింది. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహించిన పోటీలకు పలు గ్రామాలకు చెందిన రైతులు తమ వృషభాలను తీసుకువచ్చారు. తోపుదుర్తికి చెందిన రైతు చెన్నప్ప వృషభాలు మొదటి స్థానంలో నిలిచాయి. రెండో స్థానంలో గార్లదిన్నెకు చెందిన రైతు నరేష్ వృషభాలు, మూడో స్థానంలో బళ్లారికి చెందిన రైతు ఆనందరెడ్డి వృషభాలు, నాల్గో స్థానంలో సోములదొడ్డికి చెందిన రామసుబ్బారెడ్డి వృషభాలు, ఐదో స్థానాన్ని హుస్సేనాపురం రైతు వెంకటసుబ్బారెడ్డి వృషభాలు దక్కించుకున్నాయి. విజేత వృషభాల యజమానులను అభినందిస్తూ నగదు పురస్కారాలతో నిర్వాహకులు సత్కరించారు.

### గ్రామాల్లో ఉత్సాహంగా ఉగాది సేద్యం



గొందిపల్లిలో గుంటక పాస్తున్న రైతు

గుత్తి రూరల్: మండలంలోని గొందిపల్లి, తురకపల్లి, కరిడికొండ, తొండపాడు, అబ్బేదొడ్డి, బేతాపల్లి, కొత్తపేట, వన్నేదొడ్డి, మాముడూరు, అనగానదొడ్డి, బసినేపల్లి, లచ్చానపల్లితో పాటు ఇతర గ్రామాల్లో రైతులు ఉగాది సేద్యం చేశారు. ఉగాది రోజు గుంటకతో పొలం దున్ని సంప్రదాయ, ఆచారాలను పాటిస్తూ కల్మషం లేని చిన్నారులతో సేద్యం పనులను ప్రారంభిస్తే పంటలు బాగా పండుతాయని నమ్మకం. దీంతో ఆదివారం వేకువజామునే పిల్లలకు నూతన వస్త్రాలను ధరింపజేసి పొలాలకు తీసుకెళ్లారు. గొర్రు, నాగలికి పసుపు కుంకుమ పూసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎద్దులను ప్రత్యేకంగా అలంకరించి చిన్నారుల చేతుల మీదుగా సేద్యం పనులను ప్రారంభించారు. అనంతరం పొలాల్లో రైతులు గుంటక పాశారు. ఎద్దులకు ప్రత్యేక పూజలు చేసి ఈ ఏడాది పంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఆలయాల చుట్టూ ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు తిప్పారు.

### సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ ప్రారంభం

పుట్టపర్తి టౌన్: బుక్కపట్నంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏప్రిల్ 2 నుంచి స్లాట్ బుకింగ్ ప్రారంభిస్తున్నట్లు జిల్లా రిజిస్ట్రార్ కృష్ణకుమారి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కార్యాలయానికి రిజిస్ట్రేషన్ నిమిత్తం వచ్చేవారు వేచి ఉండే పని లేకుండా ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ విధానం ద్వారా ప్రజలు ముందుగానే స్లాట్ బుక్ చేసుకుని ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల్లోపు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చునన్నారు. త్వరలో జిల్లా వ్యాప్తంగా అన్ని రిజిస్టర్ కార్యాలయాల్లో ఈ విధానాన్ని అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

### ఇద్దరిపై కేసు నమోదు

ధర్మవరం అర్బన్: స్థానిక దుర్గానగర్‌లోని నెం.1 ఏటీఎం వద్ద ముగ్గురిపై దాడి చేసి గాయపరిచిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ధర్మవరం రెండో పట్టణ సీఐ రెడ్డప్ప తెలిపారు. దుర్గానగర్‌లో ఉన్న షో ఆఫ్ ఫ్యాషన్ షాపులో శనివారం సాయంత్రం దుస్తుల కొనుగోలు విషయంగా ఇషాక్, హరీష్ వాదించుకున్నారు. దీంతో హరీష్ స్నేహితులు కాటమయ్య, రాజేష్, రాజాను పిలిపించడంతో వారు ఇషాక్‌కు సర్దిచెప్పి పంపించారు. రాత్రి 9గంటల సమయంలో దుర్గానగర్ ఏటీఎం సమీపంలో కాటమయ్య, రాజా, రాజేష్ ఉండగా ఇషాక్, అతని అన్న అబ్దుల్ రెహమాన్, మరో ఇద్దరు కలసి కట్టెలతో దాడి చేసి గాయపరిచారు. క్షతగాత్రుల ఫిర్యాదు మేరకు ఆదివారం ఉదయం ఇషాక్, అతని అన్న అబ్దుల్‌రెహమాన్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### ఆకట్టుకున్న గ్రామీణ క్రీడాపోటీలు



కల్లూరులో ఇసుక మూట మోసుకెళ్తున్న యువకులు



తాడిపత్రిలో ఇరుసు ఎత్తుతున్న క్రీడాకారుడు

తాడిపత్రి టౌన్/గార్లదిన్నె: ఉగాది పర్వదినం సందర్భంగా స్థానిక పెన్నానది ఒడ్డున ఆదివారం సాయంత్రం నిర్వహించిన గ్రామీణ క్రీడా పోటీలు ఆకట్టుకున్నాయి. ఇరుసు, రాతిగుండ్లు, ఇసుక బస్తాలు ఎత్తు పోటీల్లో పెద్ద సంఖ్యలో యువకులు పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు, షీల్డ్‌లను అందజేసారు. అలాగే గార్లదిన్నె మండలం కల్లూరు ఇసుక మూట మోసే పోటీలు నిర్వహించారు. పోటీలు ఆరంభం నుంచే హోరాహోరీగా సాగాయి. ఎక్కువ దూరం ఇసుక మూటను మోసుకెళ్లిన యువకుడికి నగదు పురస్కారాలతో గ్రామస్తులు సత్కరించారు.

## క్లుప్తంగా

### కుక్కల స్టెరిలైజేషన్ పక్కాగా చేపట్టాలి



ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తికి సూచనలిస్తున్న కమిషనర్ బాలస్వామి

**అనంతపురం కార్పొరేషన్:** కుక్కల స్టెరిలైజేషన్ ప్రక్రియను పక్కాగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి ఎంహెచ్‌ఓ డాక్టర్ బాలస్వామికి సూచించారు. ఆదివారం నగరంలోని విద్యారణ్య నగర్, లక్ష్మీనగర్, కోవూర్ నగర్ ప్రాంతాల్లో వ్యాక్సినేషన్ కోసం వీధి కుక్కలను నగరపాలక సంస్థ సిబ్బంది పట్టుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి ఎన్ని కుక్కలను తీసుకెళ్తున్నారు? ఎన్ని కుక్కలకు స్టెరిలైజేషన్ పూర్తి చేశారో సమాచారం రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. ఏబీసీ సెంటర్‌కు తీసుకువచ్చిన తర్వాత వాటికి సరైన ఆహారం, నీరు అందించాలని ఆదేశించారు. ఆపరేషన్ చేసిన ప్రతి కుక్కకు రిఫ్లెక్టివ్ క్యూ ఆర్ కోడ్ డాగ్ కాలర్స్ అమర్చాలన్నారు. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఆ కుక్కకు సంబంధించిన వివరాలు తెలుస్తాయన్నారు. పారిశుధ్య కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కుక్కలను తీసుకెళ్లే సమయంలో ఎవరైనా అభ్యంతరాలు తెలిపినా.. తిరిగి వాటిని ఆయా ప్రాంతాల్లోనే వదిలేస్తారన్న విషయాన్ని తెలియజేయాలన్నారు.

### మహబూబ్ బాషా సేవలు ప్రశంసనీయం



మహబూబ్ బాషా మృతదేహానికి నివాళులర్పించిన రిజిస్ట్రార్ రమేష్ బాబు

**అనంతపురం:** ఎస్కేయూలోని క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో పని చేస్తున్న టైం స్కేల్ ఉద్యోగి మహబూబ్ బాషా శనివారం మరణించారు. శింగనమల గ్రామానికి చెందిన మహబూబ్ బాషా 1997 సంవత్సరం నుంచి వర్సిటీలో పని చేస్తున్నారు. ఎస్కేయూ రిజిస్ట్రార్ రమేష్ బాబు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర, టైం స్కేల్ ఉద్యోగుల సెక్రెటరీ సంజీవప్ప, బోధనేతర సంఘం అధ్యక్షుడు తిమ్మప్ప శింగనమలకు వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

### ప్రవీణ్ పగడాల మృతి బాధాకరం



ర్యాలీ చేపట్టిన క్రైస్తవులు

**అనంతపురం కల్చరల్:** అనుమానాస్పదంగా మృతి చెందిన క్రైస్తవ ప్రబోధకుడు పగడాల ప్రవీణ్ సేవలు చిరస్మరణీయమని పలువురు క్రైస్తవ పెద్దలు కొనియాడారు. రెవరెండ్ ప్రవీణ్ అకాల మరణానికి సంతాపంగా నగరంలో ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ చేపట్టారు. స్థానిక కోర్టు రోడ్డులోని గాస్పెల్‌హాలు వద్ద పాస్టర్ వరప్రసాద్ ప్రత్యేక ప్రార్థనలతో ర్యాలీని ప్రారంభించారు. అనంతరం క్లాక్‌టవర్ మీదుగా సప్తగిరి సర్కిల్ వద్ద ఉన్న ఎస్‌ఐయూ చర్చి వరకూ ర్యాలీ కొనసాగింది. ప్రవీణ్ పగడాల మృతికి సంతాపం ప్రకటిస్తూ సాగిన ర్యాలీని పాస్టర్ బెన్హర్‌బాబు, రెవరెండ్ సంపత్‌కుమార్ సందేశంతో ముగించారు. ప్రభుత్వం సమగ్ర దర్యాప్తుతో క్రైస్తవులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ల సంఘం అధ్యక్షుడు, దైవజనులు నెహెమ్యా నాగరాజు, మోజెస్ అనిల్‌కుమార్, ఐజయ్య, రఘునాథ్ డేనియల్, ఏసీసీసీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, ఏబీసీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొఠారి విక్టర్ డేనియల్, విల్సన్, కమలాకరావు, షీబా జయరాజ్, స్వామిదాసు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా అక్కదేవతల ఉత్సవాలు

**చెన్నేకొత్తపల్లి:** మండల పరిధిలోని ఒంటికొండ గ్రామంలో అక్కదేవతల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయాన్నే అక్కదేవతలు, చెన్నుడు, నరసింహస్వామిని గ్రామంలో మేళతాళాలతో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి ఫల, పుష్పాలను సమర్పించి పూజలు చేయించారు. ఇక మేడాపురం గ్రామంలో కొలువైన లక్ష్మీనరసింహ స్వామికి భక్తులు పెద్ద ఎత్తున పూజలు చేయించారు. స్వామి ప్రతిమలను గ్రామ సమీపంలోని కొండ నుంచి భక్తిశ్రద్ధలతో తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ప్రతిమలను ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామిని గ్రామంలోని వీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు.

# కోర్కెలు తీర్చే కల్పవల్లి సల్లాపురమ్మ

- ఎం.బండమీదపల్లిలో నేటి నుంచి నాలుగు రోజుల పాటు ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ సభ్యులు
- భారీగా తరలిరానున్న భక్తులు



సల్లాపురమ్మ ఆలయం

**రాప్తాడు:** మండలంలోని ఎం.బండమీదపల్లి గ్రామంలో కొలువైన సల్లాపురమ్మ భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతోంది. ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటూ రోజు రోజుకూ భక్తులను పెంచుకుంటోంది. కొలిచే వారికి కొంగు బంగారంగా నిలుస్తున్న సల్లాపురమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈనెల 31 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకూ నాలుగు రోజుల పాటు అంగరంగ వైభవంగా ఉత్సవాలు జరగనున్నాయి. ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామ ప్రజలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్మలగన్న అమ్మగా, ఆది పరాశక్తిగా, మూలపుటమ్మగా సల్లాపురమ్మ తల్లిని పూజిస్తారు. ప్రతి ఏటా ఉగాది పండుగ తర్వాత నాలుగు రోజులు పాటు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గ్రామంలో ఏ పనీ అయినా తలపెట్టే ముందు అమ్మవారిని దర్శించుకుని ప్రారంభిస్తే అవలీలగా పనులు పూర్తవుతాయని భక్తుల విశ్వాసం. దీంతో స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల ప్రజలు ఆరాధ్య దైవంగా సల్లాపురమ్మను పూజిస్తున్నారు. సోమవారం నుంచి ఆలయ ప్రాంగణంలో హోమాలు, ప్రత్యేక పూజలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఇనుప గ్రిల్ క్యూలైను, ప్రత్యేకంగా తాగునీరు, ప్రసాదం అందించేందుకు షామియానాలు ఏర్పాటు చేశారు.

**ఏటా ఉత్సవాలు**

మొదటి రోజు (సోమవారం) అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. రెండవ రోజు మంగళవారం శివుడి జాతర (పార్వేట) నిర్వహిస్తారు. మూడో రోజు బుధవారం సల్లాపురమ్మ జాతర (పార్వేట) జరగుతుంది. అలాగే అదే రోజు రాత్రి సీతారామ చెక్క భజన, గజ్జెల పూజ నిర్వహిస్తారు. నాలుగో రోజు గురువారం ఆంజనేయ స్వామి జాతర (పార్వేట) జరుగుతాయి.

**భక్తులకు సౌకర్యాలు కల్పించాం**



ప్రతి ఏడాది ఉగాది పండుగ తర్వాత నిర్వహించే సల్లాపురమ్మ పార్వేటకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. మొదటి, రెండు రోజులు ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తాం. మూడో రోజు బుధవారం సల్లాపురమ్మ పార్వేట జరుగుతుంది. ఉదయం అమ్మవారికి ప్రతి ఇంటి నుంచి బోనాలు సమర్పించడం జరుగుతుంది. అక్కడ మూగజీవాలను బలి ఇచ్చి, బంధువులకు విందు ఏర్పాటు చేసుకుంటాం. మళ్లీ సాయంత్రం 3 గంటలకు **అమ్మవారిని** చెరువు వద్ద ఉన్న గుడి దగ్గరకు తీసుకెళ్లి అక్కడ కుందేళ్లను విడిచి పార్వేట చేస్తాం. అదే రోజు రాత్రంతా అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ఊరేగిస్తాం. మళ్లీ మరుసటి రోజు కూడా ఆంజనేయ స్వామి పార్వేట జరుపుకుంటాం.

– ఆర్.ఉమాదేవి, సర్పంచ్, ఎం.బండమీదపల్లి

**ఇదీ ఆలయ చరిత్ర..**



సల్లాపురమ్మ దేవత మూలవిరాట్

ఎం.బండమీదపల్లి గ్రామం ఏర్పడగానే సల్లాపురమ్మ దేవత గ్రామ నడిబొడ్డున వెలసి పూజలందుకుంటోంది. ఒక రోజు గ్రామంలోని పశువుల కాపరులు గ్రామ చివరలో ఉన్న చెరువులో ఎలుకలు పట్టడానికి గుంతలు తవ్వుతుండగా ప్రతి సారి ఒక రాయి అడ్డుపడుతూ ఉండేది. ఆ రాయిని ప్రతిసారి తీసివేయడం, మరలా అడ్డుపడటం జరుగుతుండేది. ఆ రాయిని తీసివేయడం వల్ల సల్లాపురమ్మ దేవత ఒక బాలుడి ఒడిలోకి వచ్చి నేను సల్లాపురమ్మను రా.. మీ గ్రామానికి వచ్చాను.. నన్ను చెరువు సమీపంలో ప్రతిష్ఠించండి.. మీ గ్రామాన్ని చల్లగా చూస్తానని చెప్పింది. దీంతో గ్రామస్తులు అప్పటికప్పుడు సల్లాపురమ్మ దేవతను చెరువు పై భాగాన చిన్న రాతి గుడిలో ప్రతిష్ఠించారు. అక్కడే కొన్నేళ్లుగా రాతి గుడిలోనే అమ్మవారికి పూజలు చేశారు. కాలక్రమేణ అక్కడ ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, దాతల సహకారంతో చందాలు పోగు చేసి కొన్నేళ్లకు అన్ని హంగులతో నూతన ఆలయాన్ని నిర్మించారు. అక్కడే అమ్మ వారిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

### నేడు రంజాన్



నెలవంకను చూస్తున్న ముస్లింలు

**ఆత్మకూరు:** ముస్లింల పవిత్ర పండుగ రంజాన్. నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు చేశారు. ఆదివారం ఆకాశంలో నెలవంక దర్శనం ఇవ్వడంతో సోమవారం రంజాన్ పండుగ జరుపుకోనున్నారు. ఆత్మకూరులోని నూరియా జామియా మసీద్ వద్దకు ముస్లింలు పెద్ద ఎత్తున చేరుకుని నెలవంకను చూశారు. అనంతరం ప్రత్యేక నమాజ్ చేశారు.

### భక్తిశ్రద్ధలతో చివరి రోజు ప్రార్థనలు



నమాజ్ చేస్తున్న ముస్లింలు

**అనంతపురం కల్చరల్:** ముప్పై రోజులుగా సాగుతున్న ఉపవాస దీక్షల్లో చివరి రోజు ఆదివారం నగరంలోని ఖాజానగర్‌లోని అల్ హబీబ్ మసీదులో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ఇఫ్తార్ విందులో మేయర్ వసీం, జిల్లా మాజీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ ముఖ్య అతిథులుగా హాజరై, మాట్లాడారు. అత్యంత పవిత్రమైన రంజాన్ దినాలు ముగిశాయన్నారు. దానధర్మాలకు ప్రతీకగా నిలిచిన పర్వదినాన్ని సోమవారం అంతే పవిత్రంగా ముగించుకుందామన్నారు. చివరిరోజు కావడంతో పెద్ద ఎత్తున తరలి వచ్చిన ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఆకట్టుకున్న కవి సమ్మేళనాలు



ఉత్సవాలకు హాజరైన కళాభిమానులు



నృత్య ప్రదర్శన చేస్తున్న మహిళలు

**అనంతపురం కల్చరల్:** ఉగాది పర్వదినాన్ని కవులు, రచయితలు, కళాకారులు ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు కళావేదికల్లో కవి సమ్మేళనాలు, సాంస్కృతిక సంబరాలు జరిగాయి. లలిత కళాపరిషత్తులో కార్యదర్శి గాజుల పద్మజ నేతృత్వంలో సురేష్‌శర్మ పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం శాస్త్రీయ నృత్యాలు, కవిసమ్మేళనం అందరినీ ఆకట్టుకున్నాయి. తరిమెల అమరనాథరెడ్డి, షరీఫ్, చం.శాస్త్రి తదితరులు ఉగాది కవితాగానం చేశారు. అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న సీనియర్ న్యాయవాది గురుప్రసాద్ కళాకారులను సత్కరించారు.

**అలరించిన తోలుబొమ్మలాట..**

స్థానిక కృష్ణకళా మందిరంలో ఏపీ రాష్ట్ర సృజనాత్మక సాంస్కృతిక సమితి, శ్రీభగవాన్ సత్యసాయిబాబా నాటకోత్సవ సమితి ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలు నిర్వహించారు. నిర్వాహకుడు మైఖేల్‌బాబు నేతృత్వంలో ప్రాచీన కళారూపమైన తోలుబొమ్మలాట ఆకట్టుకుంది. సంధ్యామూర్తి శిష్యబృందాల శాస్త్రీయ నాట్యాలు, జిల్లా కళాకారులు ప్రదర్శించిన శ్రీకృష్ణరాయబారం నాటకం, ఆర్కెస్ట్రా కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. డీఆర్వో మలోల, ఆకాశవాణి ఉన్నతశ్రేణి వ్యాఖ్యాత జగర్లపూడి శ్యామసుందరశాస్త్రి చక్కటి పాటలు పాడి ఆకట్టుకున్నారు. అనంతరం కళాకారులను సన్మానించారు.

**శ్రీకళాపీఠం ఆధ్వర్యంలో..**

శ్రీకళాపీఠం వ్యవస్థాపకురాలు ఉమాదేవి నేతృత్వంలో స్థానిక పాతూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఉగాది సంబరాలు జరిగాయి. ఉగాది ప్రాశస్త్యాన్ని తెలిపే కవితోత్సవంలో పలువురు కవులు సందేశాత్మక కవితలను వినిపించారు. విజేతలకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి, సత్కరించారు.

## ఘనంగా ఉగాది సంబరాలు



పంచాంగ శ్రవణం చేస్తున్న సురేష్ శర్మ

**అనంతపురం కల్చరల్:** నగరమంతా శ్రీవిశ్వావసు ఉగాది శోభ నెలకొంది. శివబాలయోగి ఆశ్రమంలో వారం రోజుల పాటూ సాగే వసంత నవరాత్రుల ఉత్సవం ప్రారంభమైంది. ఆలయ ప్రతినిధులు అరవింద్, రత్నగిరి దేవరాజ్ ఆధ్వర్యంలో అనంతేశ్వరికి అలంకార సేవలు, శ్రీదేవి ఖడ్గమాల, శ్రీమణిద్వీప వర్ణన పారాయణం జరిగాయి. ఆర్ఎఫ్ రోడ్డు లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో పంచాంగ శ్రవణం, శ్రీవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. అలాగే పాతూరు నల్లలమ్మ దేవి, పాతూరు, కొత్తూరు వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయాలలో అమ్మవార్లు విశేష అలంకారంలో దర్శనమిచ్చి పూజలందుకున్నారు. అలాగే టీటీడీ ఆధ్వర్యంలో రెవిన్యూకాలనీ రామాలయంలో ఉగాది వేడుకలు జరిగాయి. వాసుదేవశాస్త్రి పంచాంగ శ్రవణం చేశారు.

**భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు**

**రాప్తాడు:** మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ప్రజలు ఉగాది పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మహిళలు వేకువజామునే లేచి తలంటుస్నానాలు ఆచరించి ఇళ్లను మామిడి ఆకులు, వేపాకుతో అలంకరించారు. ఉగాది పచ్చడి చేసుకుని, ఆరగించారు. సాయంత్రం సమయంలో ప్రముఖ ఆలయాల్లో పంచాంగ శ్రవణం, పఠన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాల్లో అర్చకులు ఉగాది పర్వదినాన్ని, తెలుగు నూతన సంవత్సర ఆరంభాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మరూరులోని చిన్నక్కదిరయ్య స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు వేలాదిగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం చుట్టూ పన్నారపు బండ్లు, ట్రాక్టర్లు తిప్పారు. అదేవిధంగా ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలను తిప్పి మొక్కులు తీర్చుకున్నారు.

**పంపనూరులో ప్రత్యేక పూజలు**

**ఆత్మకూరు:** మండల కేంద్రంలోని శివాలయం, అంకాలమ్మ ఆలయం, అక్కమ దేవతల ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. భైరవేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ప్రజలు ఉగాది పచ్చడి చేసుకుని ఆరగించారు. ఆలయాల్లో టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆత్మకూరులో అక్కమ్మ దేవతల గంపను గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయాల వద్ద భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించి పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. స్వామి వారి స్వర్ణముఖ కవచాన్ని ఆలయం చుట్టూ మేళతాళాలతో ప్రదక్షణలు చేయించారు. ఆలయంలో కాలసర్పదోష నివారణ రాహుకేతు హోమాలు చేశారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతీ దేవికి పూజలు చేపట్టారు. మహా మంగళహారతి అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు. అన్నదానం చేశారు.



రాప్తాడు: పండమేటి రాయుడు, శివుడు, నారాయణ స్వామి, శ్రీరాముడిని రథంలో ఊరేగిస్తున్న దృశ్యం



శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు



రాప్తాడు: ఆకుపూజలో నీలకంఠేశ్వర స్వామి



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు



అలంకరణలో మంజునాథుడు

## లైంగిక నేరాలకు పాల్పడితే చర్యలు



పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తున్న జడ్జి జె.సుజిన్ కుమార్

**రాప్తాడు:** బాల, బాలికలపై లైంగిక నేరాలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని స్పెషల్ జ్యుడిషియల్ మొబైల్ కోర్టు జిల్లా జడ్జి జె.సుజిన్ కుమార్ హెచ్చరించారు. రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు, మహిళలకు పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. 18 సంవత్సరాల బాల, బాలికలపై లైంగిక వేధింపులు, లైంగిక నేరాలను నివారించేందుకు ఈ చట్టం 2012లో రూపొందించడం జరిగిందన్నారు. ఎన్ని చట్టాలు ఉన్నా ఏదో ఒక చోట చిన్న పిల్లలు లైంగిక దాడులకు గురవుతూనే ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బాల, బాలికలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై తెలుసుకోవాలని సూచించారు. ఎవరైనా లైంగిక దాడులు, నేరాలకు పాల్పడితే వారికి శిక్షలు కఠినంగా ఉంటాయన్నారు. మహిళలు ఇతరులు చెప్పే మాటలు విని మోసపోకుండా ఉండాలన్నారు. మహిళలకు అన్యాయం జరిగినప్పుడు అధైర్య పడకుండా ముందడుగు వేసి న్యాయస్థానాల్లో సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సాంబశివుడు, సీఐ శ్రీహర్ష, విద్యార్థులు, స్వయం సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.



బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

## బోనాల ఊరేగింపు

ఉగాది పండుగ సందర్భంగా ఆదివారం కట్టకిందపల్లి పోతులయ్య స్వామి, చౌడేశ్వరిమాతకు మహిళలు బోనాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేపట్టారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



బోనంతో యువతులు



పూజలు చేస్తున్న దృశ్యం

## వడ్డీ మాఫీకి నేడే చివరి అవకాశం


- కమిషనర్ బాలస్వామి

**అనంతపురం కార్పొరేషన్:** ఇంటి, ఖాళీ జాగా పన్ను చెల్లింపులకు సంబంధించి ఒకేసారి పన్ను చెల్లిస్తే వడ్డీపై ప్రభుత్వం కల్పించిన 50 శాతం రాయితీకి సోమవారం చివరి అవకాశం. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ బాలస్వామి పేర్కొన్నారు. ఆదివారం నగరపాలక సంస్థ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కౌంటర్లతో పాటు వేణుగోపాల్ నగర్‌లోని 5వ సచివాలయం, పాతూరులోని 17వ సచివాలయం, రాంనగర్‌లోని 54వ సచివాలయం, శ్రీనగర్ కాలనీలోని 52వ సచివాలయం, రెండవ రోడ్డు స్టడీ పార్క్ పక్కన ఉన్న 64వ సచివాలయంలో పన్ను చెల్లింపు కేంద్రాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. చివరి రోజు కావడంతో నగరపాలక సంస్థలోని కౌంటర్లు రాత్రి 11 గంటల వరకూ, సచివాలయం కౌంటర్లు రాత్రి 9 గంటల వరకు పని చేస్తాయని వెల్లడించారు.

**రూ.77 లక్షలు వసూలు**

ఇంటి, ఖాళీ జాగా పన్ను రూ.77 లక్షలు వసూలైంది. ఆదివారం నగరపాలక సంస్థ కమిషనర్ ఆదేశాలతో రెవెన్యూ సిబ్బంది పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టిసారించారు. సెలవు దినం రోజున అసెస్‌మెంట్‌దారులతో మాట్లాడి పన్ను చెల్లించేలా చర్యలు తీసుకున్నారు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా పన్ను చెల్లించేందుకు ముందుకొచ్చారు.

## వైభవంగా ముసలమ్మ తల్లి తెప్పోత్సవం





అలంకరణలో ముసలమ్మ తల్లి, బీకేఎస్ చెరువులో తెప్పోత్సవం

**బుక్కరాయసముద్రం:** మండల కేంద్రంలోని తాడిపత్రి రహదారి పక్కన చెరువు కట్ట సమీపంలో వెలసిన ముసలమ్మ తల్లి తెప్పోత్సవాన్ని ముసలమ్మ తల్లి వంశీయులైన ఆలయ ధర్మ కర్త సుశీల, సూర్యనారాయణరెడ్డి, గ్రామస్తులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో అమ్మవారిని వివిధ పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం అమ్మవారిని పల్లకీపై అనంతపురం – తాడిపత్రి రహదారిపై ఊరేగించారు. ముసలమ్మ దేవాలయం పక్కనే ఉన్న అనంత సాగర్ (బీకేఎస్ చెరువు)లో అమ్మవారి తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఉత్సవాన్ని తిలకించారు.